సాక్షి
పెద్దపల్లి
గురువారం । 11 । ఏప్రిల్ । 2024



ముస్లింలకు ఇఫ్తార్

ఓదెల: రంజాన్ మాసం సందర్భంగా పొత్కపల్లిలోని ముస్లింలకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు

వేములవాడ: రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీస్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
38.6/26.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమయ్యే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

మహిళా కార్మికులను బెదిరిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: బీఆర్‌ఎస్ నాయకులు ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో సింగరేణి మహిళా కార్మికులను బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జీడీకే–1వ గనిపై ప్రచారానికి వెళ్లిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు తమ సమస్యలు చెప్పుకునేందుకు వెళ్లిన మహిళా కార్మికులపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. తాము ప్రశ్నిస్తున్న అంశాన్ని సెల్‌ఫోన్‌లో ఓ మీడియా రిపోర్టర్ చిత్రీకరిస్తే దాన్ని లాక్కొని వీడియో డిలీట్ చేశారని పేర్కొన్నారు. తాము ఇంకా అధికారంలో ఉన్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. తాము అధికారంలోకి వచ్చే ముందు మహిళా కార్మికులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని మక్కాన్‌సింగ్ అన్నారు.

గన్‌మెన్లను తొలగించారు.. ఖతం చేయాలని కుట్ర చేస్తున్నారు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని : కాంగ్రెస్ నాయకులు తనకు గన్‌మెన్లు తొలగించి ఖతం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత, జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధు ఆవేదన చెందారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక క్వారీలు, ఇసుక తరలించే లారీలు తనవేనని కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు దూరం చేయడమే లక్ష్యంగా వారు పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. మంథని నియోజకవర్గంలో ఎదుగుతున్న తనను హతం చేయాలని, ఇప్పటికే దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. ప్రజలు తనకు రక్షణగా నిలవాలని కోరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన తనపై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను నమ్మి అధికారం అప్పగిస్తే వందరోజుల్లో ఏంచేసిందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. నాయకులు శంకర్‌లాల్, గట్టయ్య పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: పట్టణశివారు చందపల్లిలోని ఈద్గా వద్ద గురువారం రంజాన్ ప్రార్థనలు చేసుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అధికారులు, కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ బుధవారం ఏర్పాట్లు పరిశీలించారు. సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వీలుగా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ వివరించారు.

ఎల్లంపల్లిలో 7.28 టీఎంసీల నీరు

రామగుండం: ఎండల తీవ్రత దృష్ట్యా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటినిల్వలు వేగంగా పడిపోతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, బుధవారం 7.28 టీఎంసీలకు చేరింది. గతేడాది ఇదేరోజు 10.69 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 326 క్యూసెక్కులు, గూడెం ఎత్తిపోతలకు 60 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరోవైపు.. పార్వతీ బ్యారేజీలో పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 8.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.021 టీఎంసీల నిల్వ ఉంది. గతేడాది ఇదేరోజు పార్వతీ బ్యారేజీలో 4.84 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

యోధుల స్మారక చిహ్నం నిర్మించాలి

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తిలో సమిధలైన గని కార్మిక యోధుల చిహ్నాన్ని సింగరేణి నిర్మించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మినుగురు పురుగుల కాంతిలో బొగ్గు తవ్వకం ప్రారంభించిన కార్మికులు.. నేడు ఎల్ఈడీ బల్బుల వెలుగులో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే స్థాయికి ఎదిగారని అన్నారు. తమ స్వేదం, రక్తం చిందించిన కార్మికులను సంస్థ ఎల్లకాలం గుర్తుంచుకోవాలని కోరారు. నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రాంమూర్తి, పర్లపల్లి రవి, జహీద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఎవరా షాడో ఆఫీసర్..?!

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొత్త కోణం
- నవంబరులో ఉమ్మడి జిల్లాలో పర్యటించిన ఉన్నతాధికారి
- ప్రముఖ హోటల్‌లో బస, ఇప్పటికే గుర్తించిన ఎస్ఐబీ
- ఆ సమయంలో రూ.కోట్లలో పట్టుబడ్డ ఉమ్మడి జిల్లా నేతల డబ్బు
- త్వరలో తేలనున్న సిరిసిల్ల వార్ రూం సంగతి
- అందులో పనిచేసిన సిబ్బందిని విచారించనున్న ఉన్నతాధికారులు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇందులో సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటూ.. అరెస్టయిన పోలీసు అధికారుల్లో ఒకరు గతేడాది నవంబరులో ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల పర్యటించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. అతను అసలు కరీంనగర్ జిల్లాలో ఎందుకు సంచరించారు..? దేనికోసం ఇక్కడ మకాం వేశారు..? అతను సంచరించిన రోజు రాష్ట్రంలో ఏం జరిగింది..? అన్న విషయాలపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీసి, పలు కీలక ఘటనలపై ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తొలిసారిగా లోకానికి తెలిసింది కరీంనగర్‌లో కాగా, తొలి అరెస్టు జరిగింది ఉమ్మడి కరీంనగర్‌లోని సిరిసిల్లలోనే కావడం గమనార్హం. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక్కో పోలీసు అధికారి పాత్ర ఏమిటి..? అన్నది ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఈ క్రమంలోనే డీఎస్పీ ప్రణీత్‌రావు పేరు వెలుగులోకి రావడం.. అరెస్టు కావడం.. అది కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే కావడం విశేషం. తొలిసారిగా హుజూరాబాద్ ఉపఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వెలుగులోకి తీసుకురావడం తెలిసిందే. ప్రతిపక్ష నేతల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందం పనిచేసిందని, వీరు ప్రతిపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్‌తోపాటు పలువురు మహిళల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసే ప్రయత్నం చేశారన్నది రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది.

ఆ డబ్బులకు అతనికి లింకేంటి?

ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు, సన్నిహితులను లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పోలీసులే చెబుతున్నారు. రేవంత్‌రెడ్డికి ఉమ్మడి జిల్లాలో సన్నిహితులుగా ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేత సత్తు మల్లేశ్ ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించారు. సిరిసిల్లలో వార్‌రూం ఏర్పాటు చేసుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్ సంభాషణలు రికార్డు చేసి అప్పటి ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. నవంబరులో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సమయంలో సదరు అధికారి ఎంట్రీ ఉమ్మడి జిల్లాలో రాజకీయ ప్రకంపనలకు దారితీసిందని అనుమానిస్తున్నారు. ఆ అధికారి జిల్లాకు వచ్చిన రోజు సాయంత్రం పెద్దపల్లి జిల్లాలో ఓ రోజు రూ.50 లక్షలు మరునాడు రూ.2.18 కోట్లు పట్టుబడ్డాయి. అంతకుముందు పెద్దపల్లి జిల్లాలో ఓ ప్రతిపక్ష నేతకు సంబంధించిన దాదాపు రూ.6 కోట్లు హైదరాబాద్ నుంచి వస్తుండగా ఫోన్ ట్యాపింగ్ ద్వారా గుర్తించి, పట్టుకున్నారని అనుమానిస్తున్నారు. అంతకుముందు పొరుగు రాష్ట్రం నుంచి డబ్బు, కానుకలతో వస్తున్న ఓ భారీ వాహనాన్ని ముందస్తుగా గుర్తించడంలోనూ ట్యాపింగే కీలకంగా పనిచేసి ఉంటుందని సందేహిస్తున్నారు. ఈ మూడు ఘటనలకు ముందు సదరు అధికారి ఉమ్మడి జిల్లాలో సంచరించాడని, అందుకు తగిన ఆధారాల కోసం అన్వేషిస్తున్నారు.

త్వరలో తేలనున్న సిరిసిల్ల కథ

సిరిసిల్ల కేంద్రంగా కొన్నేళ్లుగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం త్వరలోనే కొలిక్కి రానుంది. ఈ వ్యవహారంలో కొందరు పోలీసు సిబ్బంది సైతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు సమాచారం. కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు ఉన్నతాధికారులు త్వరలోనే సిరిసిల్ల వార్ రూం ఉన్న ప్రాంతాన్ని సందర్శిస్తారని సమాచారం. జిల్లాలో ఎక్కడ వార్ రూం నిర్వహించారు? ఏ లొకేషన్‌లో వారి ఆశ్రయం దొరికింది? ఎవరెవరి ఫోన్‌కాల్స్ ట్యాప్ అయ్యాయి? అన్న విషయం తెలిసే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం పనిచేసిన ఓ ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లను సైతం విచారించే అవకాశాలు లేకపోలేదు. ఇవన్నీ కార్యరూపం దాల్చితే త్వరలోనే సిరిసిల్ల వార్ రూం కథ కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

కరీంనగర్‌లో బస!

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉన్నతాధికారుల్లో ఒకరు 2023 నవంబరులో ఒకసారి ఉమ్మడి కరీంనగర్‌లో పర్యటించారు. కరీంనగర్‌లోని ఓ ప్రఖ్యాత హోటల్‌లో 26వ తేదీన బసచేశారు. తాను వచ్చినట్లు ఎవరికీ తెలియకుండా ఎంతో జాగ్రత్తపడిన సదరు ఉన్నతాధికారి.. ట్యాపింగ్ వ్యవహారంలోనూ షాడోలా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. మరునాడు అతను ఏమాత్రం బిల్లు చెల్లించకుండా ఉమ్మడి జిల్లాలో మరోచోటుకి వెళ్లిపోయాడని తెలిసింది. హైదరాబాద్‌లో కీలకంగా ఉన్న సదరు అధికారి కరీంనగర్‌కు ఎందుకు వచ్చాడు..? ఏం పని మీద వచ్చాడు..? అన్న దానిపై నిఘావర్గాలు కూపీలాగే పనిలో పడ్డాయి. ఎందుకంటే ఆ సమయంలో బీఆర్‌ఎస్ గవర్నమెంట్ అధికారంలో ఉంది. ఆ సమయంలో ఎవరి మీద నిఘా కోసం సదరు అధికారి వచ్చాడు? అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

గొంతెండుతోంది



వాల్వ్ ఏర్పాటు కోసం కాలనీలో తవ్వి వదిలేసిన గొయ్యి

- తాగునీటి పైపులైన్ నిర్మించని అధికారులు
- బల్దియా చుట్టూ రాజలక్ష్మికాలనీ వాసుల ప్రదక్షిణలు
- నీళ్లివ్వడానికి రెండేళ్లుగా నిర్లక్ష్యం వహిస్తున్న పాలకులు
- ఈ వేసవిలోనైనా గొంతు తడపాలని వేడుకోలు

కరువు కథలు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, రాజీవ్ రహదారికి రాజలక్ష్మి కాలనీ కూతవేటు దూరంలోనే ఉంటుంది. ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో ప్రభుత్వ, సింగణి ఉద్యోగులు, వ్యాపారులు రూ.లక్షలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేసి నివాసాలు నిర్మించుకుంటున్నారు. బల్దియాకు అన్నిరకాల పన్నులు, బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. కానీ, కాలనీవాసుల గొంతు తడపడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

రెండేళ్లుగా నిర్లక్ష్యమే..

5వ డివిజన్ పరిధిలోని రాజలక్ష్మి కాలనీకి కొత్తగా పైప్‌లైన్ నిర్మించి తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు రెండేళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కలెక్టర్, మేయర్‌తోపాటు మున్సిపల్ కమిషనర్లకు అనేకసార్లు విన్నవించుకున్నారు. ఈ వేసవిలోనైనా తాగునీరు సరఫరా చేయాలని ఆర్నెల్లుగా అధికారులకు మొరపెట్టుకుంటున్నా కనికరించే నాథుడే లేడు.

అర్ధంతరంగా పనుల నిలిపివేత..

ఏడాది క్రితం కాలనీలోని సగం దూరం వరకు పైప్‌లైన్ నిర్మించి అక్కడే ఆపేశారు. కాలనీ సమీపంలోని మిషన్ భగీరథ 6 ఇంచుల మెయిన్ పైప్‌లైన్‌కు ఇంతే సైజ్‌గల పైపులైన్ అనుసంధానించి.. కాలనీలో 4ఇంచుల హెడ్ డీపీ పైప్‌లైన్ నిర్మించాల్సి ఉంది. కానీ, మెయిన్ లైన్‌కు 4 ఇంచుల పైప్‌లైన్ వేసి చేతులు దులుపుకున్నారు. దీనికి వాల్వ్ ఏర్పాటు చేసేందుకు ఐదు నెలల క్రితం రోడ్డు మూలమలుపు వద్ద గొయ్యి తవ్వి అది బిగించకుండానే గాలికి వదిలేశారు. దీంతో వాహనదారులు అదుపుతప్పి గొయ్యిలోపడి ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం ఈ వేసవిలోనైనా తమకాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడాదిగా ఎదురుచూపులే



నీళ్లకోసం ఏడాదిగా బల్దియా చుట్టూ ప్రదక్షిణలు చేసినా అధికారులు కరుణించడం లేదు. ఇప్పటికే ఇద్దరు కమిషనర్లు మారిండ్రు. కొత్త కమిషనర్ వచ్చినా మంచినీటి సమస్య తీరలే. తాగునీటికి తపిస్తున్నం.

– ఊరగోండ రమేశ్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



మాకాలనీకి తాగునీరు వెంటనే సరఫరా చేయాలి. ఈ ఎండాకాలంలో తాగునీరు లేకుండా ఎలాఉంటాం? మాకు మంచినీళ్లు ఇవ్వాలని ఏడాది నుంచి అధికారులకు చెబుతున్నాం.. ఎందుకు చర్యలు తీసుకుంటలేరో అర్థం కావడం లేదు.

– గౌడ రమాదేవి, గృహిణి

సమస్య సమీక్షిస్తాం



రాజలక్ష్మి కాలనీలో తాగునీటి సరఫరా సమస్యపై అధికారులతో వెంటనే సమీక్షిస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. సమస్య గుర్తించేందుకు అధికారులను కాలనీకి పంపిస్తాం.

– శ్రీకాంత్, కమిషనర్, నగరపాలక సంస్థ, రామగుండం

ఇకనుంచి ఆన్‌లైన్‌లోనే కలప పర్మిట్లు

- ఈనెల ఒకటి నుంచే అమల్లోకి
- అందుబాటులో ఎన్‌టీపీఎస్ పోర్టల్



శ్రీధర్‌బాబుకు సమస్యలు విన్నవిస్తున్న సామిల్లర్లు

పెద్దపల్లిరూరల్: ఇంటి నిర్మాణాలు, ఇతర పనులకు అవసరమయ్యే కలప(కర్ర) రవాణా చేసేందుకు అవసరమయ్యే పర్మిట్లను ఇకనుంచి ఆన్‌లైన్‌లో పొందాల్సిందే. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. మొన్నటివరకు స్థానికంగా అందుబాటులో ఉండే అటవీ శాఖ అధికారుల ద్వారా టింబర్, సామిల్లు వ్యాపారులు పర్మిట్లు పొందేవారు. కానీ ఈ ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆన్‌లైన్ పద్ధతిని అమల్లోకి తెస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఎన్‌టీపీఎస్ పోర్టల్‌లో నమోదు..

కలప రవాణా చేసేవారి కోసం ఆన్‌లైన్‌లో నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టం(ఎన్‌టీపీఎస్) పోర్టల్‌ను అందుబాటులో ఉంచారు. ఈ పోర్టల్‌ను లాగిన్ అయి వివరాలు నమోదు చేసి సంబంధిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఆ వివరాలను స్థానికంగా ఉండే అధికారులకు చేరుస్తారు. వారు దరఖాస్తుదారు వద్దకు వెళ్లి వివరాలు పరిశీలించి ఆన్‌లైన్‌లో ధ్రువీకరించి ఆన్‌లైన్‌లోనే పర్మిట్ జారీచేస్తారు.

ఆన్‌లైన్ పర్మిట్ వద్దు..

కలప పర్మిట్ల జారీలో ఆన్‌లైన్ విధానం వద్దని, పాత పద్ధతినే కొనసాగించాలని సామిల్లు యజమానుల సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రావు, దేవేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు జిల్లామంత్రి శ్రీధర్‌బాబును కలిసి విన్నవించారు. ఆన్‌లైన్ విధానంతో తమపై ఆర్థికభారం పడుతుందని, అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. మహారాష్ట్రలో 2022లోనే ఈ పద్ధతి అమలు చేసినా అనేక సమస్యలు తలెత్తడంతో ఎత్తేవేశారని గుర్తుచేశారు. అయితే, మంత్రి కొండా సురేఖ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానని శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారని వారు వివరించారు.

వ్యాపారులతో సమావేశం

జిల్లాలోని టింబర్, సామిల్లు వ్యాపారులకు ఆన్‌లైన్ పర్మిట్ల జారీపై అవగాహన కల్పించేందుకు అధికారులు ఇటీవల సమావేశం ఏర్పాటు చేశారు. వ్యాపారులు తమ సందేహాలు లేవనెత్తగా కేంద్రప్రభుత్వం జారీచేసిన ఆదేశాల ప్రకారం అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రుసుం చెల్లించే విధానం తదితర అంశాలపై అర్థమయ్యేలా వివరించినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య తెలిపారు.

ఇదేవిషయంపై జిల్లా కేంద్రంలో సామిల్లు యజమానులు బుధవారం సమావేశమై చర్చించారు. అనంతరం జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్యను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శిగా దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేశ్‌రెడ్డి, శ్రీనివాస్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీగా చక్రధర్, గౌరవ అధ్యక్షుడిగా ధర్మారెడ్డి ఎన్నికయ్యారు.

తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానీయొద్దని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లతో బుధవారం ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరా, పాఠశాలల్లో అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, అధికారులు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్య ఏర్పడితే ప్రత్యామ్నాయ పద్ధతుల్లో పరిష్కారం చూపాలని అన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, సీఎమ్మార్ సేకరణ, పాఠశాలల్లో అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతుల కల్పన..

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారినపడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృతప్రచారం చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డీఈవో మాధవి, డీసీవో శ్రీమాల తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ కల్పనలో జిల్లాకు నాలుగో స్థానం



అంతర్గాం మండలం గోలివాడలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పెద్దపల్లిరూరల్: ఉపాధిహామీ జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పించడంలో జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరంలో తొలుత ఉపాధి పనులు మందకొడిగా సాగినా.. చివరి దశలో ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచారు. దీంతో పనుల్లో వేగం పెరిగింది. కూలీలకు పనులు కల్పించడం, వేతనాలు చెల్లించడం తదితర అంశాలతో రాష్ట్రంలో 13వ స్థానంలో ఉన్న జిల్లా.. మార్చి ఆఖరు నాటికి నాలుగో స్థానానికి చేరిందని అధికారులు తెలిపారు. జిల్లాలో 53,470 కుటుంబాలు ఉండగా అందులో 2,865 కుటుంబాలకు 100రోజులపాటు ఉపాధి పనులు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉపాధిహామీ ద్వారా కూలీలకు పనులు కల్పించడంలో వికారాబాద్ జిల్లా అగ్రస్థానంలో నిలవగా.. ఉమ్మడి జిల్లా కేంద్రమైన కరీంనగర్ రెండో స్థానంలో నిలిచింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విషయానికొస్తే కరీంనగర్ రెండో స్థానం, పెద్దపల్లి నాలుగో స్థానం, రాజన్న సిరిసిల్ల 7వ స్థానం, జగిత్యాల జిల్లా 15వ స్థానంలో నిలిచాయి.

లక్ష్యం అధిగమించాం

జిల్లాలో ఉపాధిహామీ పనుల లక్ష్యం అధిగమించాం. కూలీలకు పనులు కల్పించి సకాలంలో వేతనాలు చెల్లించాం. దీంతో జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది.

– రవీందర్, డీఆర్డీవో, పెద్దపల్లి

అభివృద్ధిలో పెద్దపల్లికి ప్రాధాన్యం

- బైపాస్ రోడ్డు నిర్మాణంపై కదలిక
- పత్తిపాక రిజర్వాయర్‌పై చిగురిస్తున్న ఆశలు
- ఎన్నికల హామీల అమలుకు చర్యలు
- కొత్త ప్రభుత్వంపై పట్టణవాసుల ఆశలు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. జిల్లా కేంద్రమైన పెద్దపల్లిని హోదాకు తగ్గట్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు, బైపాస్‌రోడ్డు నిర్మాణం, ప్రధాన కూడళ్ల సుందరీకరణ, సాగునీటి కోసం పత్తిపాక రిజర్వాయర్ అభివృద్ధిపై జిల్లావాసుల ఆశలు గురిస్తున్నాయి. సంపూర్ణ మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పెద్దపల్లి రూపురేఖలు మారుతాయని విశ్వసిస్తున్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీల ఫలాలు జిల్లావాసులకు ఇప్పటికే అందుతున్నాయి.

బైపాస్‌రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన

- పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్, పెద్దపల్లిలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు చర్యలు చేపట్టారు.
- జిల్లాలో విస్తరించి ఉన్న రహదారిపై భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి.
- దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మృతుల సంఖ్య పెరుగుతోంది.
- వాహనాల రద్దీ, ప్రమాదాల నియంత్రణకు బైపాస్ రోడ్డు అనివార్యమైంది.
- ఎన్నికల సమయంలో విజయరమణారావు ఇచ్చిన హామీ మేరకు పెద్దపల్లి మండలం పెద్దకల్వల – నిమ్మనపల్లి గ్రామాల మార్గంలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి అధికారులతో కలిసి ఇటీవల స్థల పరిశీలన చేశారు.
- ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే.. రాజీవ్ రహదారిపై ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందనే అభిప్రాయాలున్నాయి.



పత్తిపాక రిజర్వాయర్‌పై ఆశలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డి–83, డి–86 కాలువల నీటిపై ఆధారపడి సాగవుతున్న పంటల కోసం ధర్మారం మండలం పత్తిపాక–నర్సింగపూర్ మధ్య రిజర్వాయర్‌ను నిర్మించాకే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. దీంతో ఈప్రాంత రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. అప్పటిమంత్రి హరీశ్‌రావుకు ఈప్రాంత రైతాంగం పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణ ఆవశ్యకత వివరించారు. దీనికోసం చేసిన ప్రతిపాదనలు ఇప్పుడు అటకెక్కాయి. తాజాగా మంత్రి శ్రీధర్‌బాబు రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బస్సుడిపో ఏర్పాటుకు కృషి

- పార్లమెంట్, అసెంబ్లీ, జిల్లా కేంద్రంగా ఉన్న పెద్దపల్లిలో ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు కాలేదు.
- ఈ ప్రాంతానికి చెందిన నేతలు గోనె ప్రకాశ్‌రావు, సోమారపు సత్యనారాయణ ఆర్టీసీ చైర్మన్లుగా వ్యవహరించినా పెద్దపల్లిలో డిపో ఏర్పాటు చేయలేకపోయారు.
- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దపల్లిలో బస్సు డిపో కాకున్నా.. మినీ డిపో అయినా ఏర్పాటు చేసి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తారనే ఆశలు పెరుగుతున్నాయి.

అభివృద్ధికి కృషి



జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లి అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో కృషి చేస్తా. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోంది. వీలైనంత త్వరగా పెద్దపల్లి ప్రగతి పనుల ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచి నిధులు మంజూరయ్యేలా చూస్తా.

– విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

ఇప్పటికే ‘టాస్క్’ ఏర్పాటు

విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు నైపుణ్య శిక్షణ పెంపొందిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో పెద్దపల్లిలో టాస్క్ సెంటర్ ఏర్పాటు చేశారు. పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఓ భవనంలో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి జిల్లాకు చెందిన యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు.

క్లుప్తంగా

అల్ఫోర్స్‌లో గ్రాడ్యుయేషన్ డే



రామడుగు: గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో బుధవారం యుకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నెమలివాహనంపై విహారింపు



వేములవాడ: శ్రీరామ నవరాత్రోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలందుకున్న స్వామివారి బుధవారం రాత్రి నెమలి వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో బి.శ్రీనివాస్, ఏఈ డి.శేఖర్, ఇతర అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 400 గ్రాముల గంజాయి స్వాధీనం

పెగడపల్లి: గంజాయి విక్రయించేందుకు యత్నించిన నలుగురు వ్యక్తులను పెగడపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని దోమలకుంట గ్రామానికి చెందిన బైర కల్యాణ్, ఆదిలాబాద్ జిల్లా నిగిని గ్రామానికి చెందిన రాథోడ్ అర్జున్, నిర్మల్ జిల్లా రాయదరి గ్రామానికి చెందిన రాథోడ్ దేవ, జాదవ్ కిషన్ బుధవారం మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారివద్ద 400 గ్రాముల గంజాయి లభించింది. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై వివరించారు.

ఆలయంలో చోరీ

కమాన్‌పూర్(పెద్దపల్లి): గుండారం గ్రామంలోని శ్రీభక్తాంజనేయ దేవాలయంలో చోరీ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం హుండీ లెక్కించేందుకు యత్నించగా.. అప్పటికే తాళం ధ్వంసమై కనిపించింది. హుండీలోని నగదు అపహరించిన దొంగలు.. తాళానికి తెల్లనిగుడ్డ చుట్టి వెళ్లారు. అయితే, చోరీ ఎప్పుడు జరిగిందనే విషయం తెలియదని కమిటీ సభ్యులు తెలిపారు. రెండేళ్ల నుంచి భక్తులు హుండీలో వేసిన కట్న, కానుకలను దొంగలు అపహరించడం చర్చనీయాంశంగా మారింది.

బియ్యం లారీ పట్టివేత

హుజూరాబాద్: హుజూరాబాద్‌లోని పరకాల క్రాస్‌రోడ్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న బియ్యం లారీని చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆ లారీలో సుమారు 320క్వింటాళ్ల బియ్యం ఉండగా, అవి పరకాల పట్టణంలోని భూపాలపల్లి రోడ్డులో గల ఓ రైస్ మిల్లు నుంచి గుజరాత్‌కి తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యానికి సంబంధించిన అనుమతి పత్రాలు చూపకపోవడంతో లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. డీఎస్‌వో గౌరీ శంకర్, డీటీసీఎస్ వసంతరావు, ఎఫ్ఐ వినోద్‌కుమార్ లారీలోని బియ్యం శాంపిళ్లను సేకరించి టెస్టింగ్ కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. శాంపిల్ నిర్ధారణ అయ్యాక శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 320 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని సివిల్ సప్లై అధికారులు వివరించారు.



గాయపడిన డీఎస్వో కార్యాలయ ఉద్యోగి రమేశ్



డీపీఆర్వో కార్యాలయంలో వాటర్ బాటిళ్లను లాక్కొచ్చి నీరు తాగుతున్న కోతులు



కలెక్టరేట్‌లో దారికి అడ్డంగా కోతులు

కలెక్టరేట్‌లో కిష్కింధకాండ

- ఉద్యోగికి గాయాలు.. భయం భయంగా విధులు
- నివారించాలంటున్న ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్: పల్లెలు, పట్టణాలు కోతిచేష్టలకు ఇబ్బందులు పడుతుండగా తాజాగా వానరసేన కరీంనగర్ కలెక్టరేట్ సముదాయాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అడుగు కదపడమే తరువాయి కోతుల సమూహం భయభ్రాంతులకు గురి చేస్తోంది. తరమాలని చూస్తే చాలు మీదపడి గాయపర్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. బుధవారం సుమారు 500 వరకు కోతులు రాగా అన్నిశాఖలకు వెళ్లేదారిలో చేరి ఉద్యోగులను ఇబ్బంది పెట్టాయి. పలు విభాగాలకు చేరే నెట్ కనెక్షన్ వైర్లు, కేబుల్, ఇతర వైర్లతో కాలక్షేపం చేస్తుండగా కంప్యూటర్లలో సాంకేతిక సమస్య తలెత్తింది. తలుపులు మూసుకుని విధులు నిర్వహించే పరిస్థితి నెలకొంది. బుధవారం మధ్యాహ్నం డీఎస్వో కార్యాలయ ఉద్యోగి రమేశ్ వేరే కార్యాలయానికి వెళ్తున్న క్రమంలో కోతులు దాడి చేశాయి. దీంతో అతని ఎడమ కాలికి గాయం కాగా.. ప్యాంట్ చిరిగిపోయింది. చికిత్సనిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోతుల బెడదను నివారించాలని కలెక్టరేట్ ఉద్యోగులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

జల్సాలకు అడ్డొస్తున్నాడని హత్య

- మల్లాపూర్‌లో నిందితుడు రవితేజ అరెస్టు
- వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మల్లాపూర్: జల్సాలకు అడ్డొస్తున్నాడని సవితి తండ్రి అంబదాస్(54)ను హత్య చేసిన నిందితుడు రవితేజను అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలిపారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వింజపల్లి గ్రామానికి చెందిన అంబదాస్ 20 ఏళ్ల క్రితం మల్లాపూర్‌కు వలస వచ్చాడు. మండలంలోని కుస్తాపూర్‌కు చెందిన కండెల భోజమ్మ భర్త చనిపోవడంతో 15 ఏళ్ల క్రితం రెండోపెళ్లి చేసుకున్నాడు. భోజమ్మకు అప్పటికే కుమారుడు రవితేజ ఉన్నాడు. భోజమ్మతో అంబదాస్ కలిసి ఉండడాన్ని ఇష్టంలేని రవితేజ జల్సాలకు అలవాటుపడ్డాడు. దీనికి అంబదాస్ అడ్డు చెబుతున్నాడు. దీంతో అతడిపై కక్ష పెంచుకున్న రవితేజ.. చికెన్‌సెంటర్‌కు వెళ్లి మామిడికాయలు కోసేందుకని కత్తి తెచుకున్నాడు. గత శుక్రవారం ఇంట్లో భోజనం చేస్తున్న అంబదాస్‌పై వెనుక నుంచి ఒక్కసారిగా దాడి చేసి కత్తితో గొంతుకోసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన అంబదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మెట్‌పల్లి సీఐ నవీన్, ఎస్సై కిరణ్‌కుమార్ ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. బుధవారం మల్లాపూర్‌లోని నంది చౌరస్తాలో అపరిచిత వ్యక్తి తిరుగుతున్నాడన్న సమాచారంతో సీఐ, ఎస్సై పోలీసు సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా.. అన్ని విషయాలు వెల్లడించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్

గంగవ్వ బాగున్నావా..!



మై విలేజ్‌షో టీంను సన్మానించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు సత్యం, శ్రీనివాస్, సత్యనారాయణ

- మై విలేజ్ షో సభ్యులను సన్మానించిన మంత్రి, ఎమ్మెల్యేలు

మల్యాల(చొప్పదండి): 'గంగవ్వ బాగున్నావా..' అంటూ మై విలేజ్ షో ఫేం గంగవ్వను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆప్యాయంగా పలుకరించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపల్లి గ్రామంలోని మై విలేజ్ షోటీం సభ్యులను మంత్రి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం కలిశారు. ముందుగా శాలువాలతో సన్మానించారు. 'సీఎం రేవంత్ రెడ్డి రమ్మన్నడు.. ఎప్పుడు కలుద్దాం..' అంటూ మంత్రి గంగవ్వను పలుకరించారు. మై విలేజ్ షో టీం, గంగవ్వతో తెలంగాణ యాసకు మరింత క్రేజ్ పెరిగిందని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. అనంతరం లంబాడిపల్లి గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని మై విలేజ్ షో టీం సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించగా, సానుకూలంగా స్పందించి, అప్పటికప్పుడు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన ఒకరి అరెస్టు

కరీంనగర్‌క్రైం: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని అక్రమించిన కేసులో గతంలో ధరణి కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఎల్లంకి బుచ్చిరాజు(31)ను బుధవారం అరెస్టు చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం నకిలీ ధృవపత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించారని కొత్తపల్లి మాజీ తహసీల్దార్ చిల్లా శ్రీనివాస్, అతని బినామీ, సహకరించినవారిపై కరీంనగర్ సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో 12మందిపై కేసు నమోదైంది. ఈ కేసులో ముగ్గురికి ఇప్పటికే రిమాండ్ విధించిన విషయం విదితమే. ఈ కేసులో మరో నిందితుడిగా ఉన్న కరీంనగర్ భగత్‌నగర్‌కి చెందిన ఎల్లంకి బుచ్చిరాజును అదుపులోకి తీసుకొని, కోర్టులో హాజరుపరచగా 14రోజుల రిమాండ్ విధించారు.



కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలు



జగిత్యాలక్రైం: మల్యాల మండలం కొండగట్టు సమీపంలోని దొంగలమర్రి వద్ద బుధవారం సాయంత్రం జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారిపై కారు అదుపుతప్పి బోల్తాపడగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన పోతుగంటి వేణుతో పాటు ఆయన కుమారుడు ఇద్దరు కలిసి వేములవాడ వెళ్లి తిరిగి వస్తుండగా కొండగట్టు దొంగలమర్రి వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తాపడగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఇద్దరిని కారులోంచి బయటకు తీసి అంబులెన్స్‌లో జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం సంఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో కారును బయటకు తీసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య



కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామానికి చెందిన మిట్టపెల్లి లింగారెడ్డి (70) అనే వృద్ధుడు బుదవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం లింగారెడ్డి గత కొంత కాలంగా షుగర్‌తో పాటు పలు వ్యాధులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి కలిగి బుదవారం గ్రామ శివారులోని ఓ రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ గల్ఫ్ కార్మికుడి మృతి



నజీర్(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): పక్షం రోజులుగా మృత్యువుతో పోరాడిన గల్ఫ్ వలసజీవి చివరికి బుధవారం తుది శ్వాస విడిచాడు. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు. ముస్తాబాద్‌కు చెందిన ఎండీ నజీర్(43) గత నెల 24న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నజీర్‌ను సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్సకు రూ.5లక్షల వరకు అప్పులు అయ్యాయి. అయినా నజీర్ పరిస్థితి విషమంగానే ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుదవారం మృతిచెందాడు. నెల రోజుల క్రితమే దుబాయ్ నుంచి స్వగ్రామం వచ్చాడు. దుబాయ్‌లో ఉండగానే అనారోగ్యానికి గురై స్వగ్రామానికి చేరుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. నజీర్ మృతితో భార్య షాహెద, ఇద్దరు కుమారులు, తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి...



రాజు మృతదేహం

హుజూరాబాద్: హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామంలో బుధవారం విద్యుత్‌షాక్‌తో ముద్రబోయిన రాజు(45) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. రాజు పొలం పనుల నిమిత్తం తన వ్యవసాయభూమి వద్దకు వెళ్లాడు. పొలం ఒడ్డుపై గడ్డికోస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్ తగిలి షాక్ కొట్టింది. దీంతో రాజు అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయి మాయంలో ఇద్దరిపై వేటుకు సిద్ధం..?

జగిత్యాలక్రైం: సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన అంబులెన్స్ నుంచి గంజాయి మాయమైన విషయం తెల్సిందే. ఈ ఘటనపై అధికారులు ఇప్పటికే విచారణ చేపట్టి విధుల్లో ఉన్న ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌కు రంగం సిద్ధం చేశారు. గంజాయి మాయమైంది ఏ సమయంలో అన్నది పోలీసుల విచారణలో ఇప్పటికీ అంతుచిక్కలేదు. దీంతో ఎవరిపై చర్యలు చేపట్టాలన్న దానిపై విచారణ చేపట్టిన అధికారులు.. రెండురోజుల పాటు విధుల్లో ఉన్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

వీణవంక: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి(25)ని ప్రేమపేరుతో వేధించిన అదే గ్రామానికి చెందిన కర్నె హరీశ్, అతడికి సహకరించిన కర్నె వినయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం సదరు యువతిని గత ఎనిమిది నెలలుగా హరీశ్ ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. ఇతడిని వినయ్ అనే వ్యక్తి సహకరిస్తున్నాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉద్యోగం కోసం పోయి ఊపిరి వదిలావా బిడ్డా..

- ఆంధ్రాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ యువకుడి మృతి
- కన్నీటి పర్యంతమైన కుటుంబసభ్యులు



దాసరి నరేశ్(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ప్రేమ వివాహం చేసుకుని సొంతంగా జీవనోపాధి పొందేందుకు వెళ్లి ఊరుకాని ఊరులో ఊపిరి వదిలావా బిడ్డా.. ఒక్కగానొక్క కొడుకువని గారాబంగా చూసుకున్నం.. దేవుడికి ఏం అన్యాయం చేసినం కొడుకా.. మానుంచి నిను తీసుకెళ్లిండు.. ఇకమాకు దిక్కెవరు తండ్రీ? అని దాసరి నరేశ్(29) తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు హృదయవిదారకంగా మారింది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్‌కు చెందిన దాసరి సూరయ్య–లక్ష్మి దంపతులకు దాసరి నరేశ్ఒక్కగానొక్క కుమారుడు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగ నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో భార్య అఖిలతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఓ ప్రైవేటు గ్రానైట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. భార్య అఖిల ఉగాది పండుగకు పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలైన నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు రామగుండంలోని ఐదో డివిజన్‌లో మేస్త్రీ పనులు చేసుకుంటూ నివసిస్తున్న తండ్రి సూరయ్యకు సమాచారం అందించారు. సూరయ్య వెంటనే చిలకలూరిపేటకు బయలుదేరి వెళ్లాడు. కుమారుడి మరణవార్త విన్న తల్లి లక్ష్మి కన్నీటిపర్యంతమవుతోంది. నరేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం రామగుండంలోని నర్రాశాలపల్లెకు తీసుకురానున్నారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

కాపర్‌వైర్ చోరీ కేసులో అరెస్ట్

రామగిరి(మంథని): లద్నాపూర్ ఓసీపీ–2 వద్ద కాపర్‌వైర్ చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్సై సందీప్ కుమార్‌తో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం ప్రకారం.. నవాబ్‌పేట గ్రామానికి చెందిన పస్తాం తిరుపతి, సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన మోటం అజయ్ ఈనెల 5న లద్నాపూర్ ఓసీపీ–2 వద్ద కాపర్‌వైర్ చోరీ చేశారు. నాగేపల్లి చౌరస్తా వద్ద బుధవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా పస్తాం తిరుపతి, మోటం అజయ్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారిని ఆపి సోదా చేశారు. ఈక్రమంలో వారివద్ద సుమారు 24 కిలోల కాపర్ వైర్ లభించింది. దానివిలువ సుమారు రూ.85వేల వరకు ఉంటుంది. ఈమేరకు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన సీఐ వెంకటేశ్వర్లుతోపాటు ఎస్సైలు సందీప్ కుమార్, పురుషోత్తం దివ్య, సిబ్బందిని గోదావరిఖని ఏసీపీ రమేశ్‌గౌడ్ అభినందించారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

ప్రియురాలి ఎడబాటు.. ప్రియుడి ఆత్మహత్య



మణిదీప్(ఫైల్)

మల్యాల(చొప్పదండి): ప్రియురాలు ఎడబాటుతో మనస్తాపం చెందిన యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్యాల మండలం రామన్నపేట గ్రామంలో చోటుచేసుకుంది. మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం కథనం ప్రకారం.. రామన్నపేట గ్రామానికి చెందిన వకుళాభరణం శ్రీనివాస్, అరుణకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు మణిదీప్(31)ఎంబీఏ పూర్తిచేసి, హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. కొంతకాలం కలిసి తిరిగారు. అనంతరం మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. దీంతో మణిదీప్ మనస్తాపానికి గురై, గతనెల 20వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొంది కోలుకుంటున్నాడు. ఈ క్రమంలో మరోసారి మణిదీప్ బుధవారం తన ఇంట్లోని వంటగదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

టికెట్ తీసుకోలేదని ప్రయాణికురాలిని మధ్యలో దింపిన కండక్టర్

శంకరపట్నం: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ టికెట్ తీసుకోలేదంటూ సదరు బస్సు కండక్టర్ మధ్యలో దింపిన ఘటన బుధవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో చోటుచేసుకుంది. కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ ఆర్డినరి బస్సు ఉదయం 10.30 గంటలకు ప్రయాణికులతో కరీంనగర్ నుంచి హుజూరాబాద్ బయల్దేరింది. మానకొండూర్‌లో బస్సు ఎక్కిన ఓ ప్రయాణికురాలు గట్టుదుద్దెనపల్లి దాటాక ఆధార్‌కార్డు చూపించి హుజూరాబాద్ మండలం సింగాపూర్‌కు టికెట్ ఇవ్వాలని మహిళా కండక్టర్‌కు విన్నవించింది. దీంతో కోపంతో ఊగిపోయిన కండక్టర్.. ఇప్పటిదాకా టికెట్ ఎందుకు తీసుకోలేదంటూ శంషాబాద్ (చింతకుంట)సమీపంలో బస్సులో నుంచి దింపేసింది. తోటి ప్రయాణికులు కండక్టర్‌ను వారించినా వినిపించుకోలేదని సమాచారం. ఈ సంఘటన స్వయంగా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లాలో జరగడం చర్చానీయాంశమైంది. మధ్యలో దింపితే ఆ ప్రయాణికురాలు ఎటు వెళ్తుందని, బస్సులోకి తీసుకోవాలని సూచించినా ఆ మహిళ కండక్టర్ మనస్సు మార్చుకోలేదని తోటి ప్రయాణికులు తెలిపారు.

ఎంపీగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేసిచూపిస్తా

- బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: తనను పెద్దపల్లి ఎంపీగా గెలిపిస్తే ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ హామీ ఇచ్చారు. బుధవారం జీడీకే–1గనిపై కార్మికులను కలిసి ఓటు వేయాలని కోరారు. సింగరేణి కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు, సొంతింటి కల, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. నిరుపయోగంగా ఉన్న సింగరేణి క్వార్టర్లను కార్మికులకు కేటాయించాలన్నారు. కారుణ్య నియామకాల ద్వారా 15వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్యంతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకుడు మిరియాల రాజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

'కొప్పుల'కు చేదుఅనుభవం

కాగా, గనిపై కొప్పుల ఈశ్వర్ కార్మికులను కలుస్తూ తనకు ఓట్లు వేయాలని విన్నవించారు. ఈక్రమంలో మహిళలు ఆయన వద్దకు చేరుకుని తమకు అన్యాయం జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. తమను హీనంగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక మోయించడం, ఇతర కష్టమైన పని చేయిస్తున్నారని అన్నారు. మహిళా కార్మికులు ప్రశ్నిస్తున్నంత సేపు కొప్పుల ఈశ్వర్ మౌనంగా ఉండిపోయారు. వారి సమస్యలు విన్నారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మాజీమంత్రిని బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు

గోదావరిఖని: రూ.10లక్షలు ఇవ్వాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. వెల్గటూర్ మండలానికి చెందిన నిమ్మ భరత్‌అనే వ్యక్తి కరీంనగర్‌లోని తన ఇంటికి వచ్చి తనకు సోషల్‌మీడియాలో పనిచేయడం అంటే చాలా ఇష్టమని, మీగురించి మంచి పోస్టింగ్‌లు పెడతానని, కాంగ్రెస్ వాళ్లు ప్రజలకు చేసిందేమీ లేదని నమ్మబలికినట్లు సీఐ వెల్లడించారు. ఈక్రమంలో మాజీమంత్రి తాను ఇంకా ప్రచారం మొదలు పెట్టలేదని, ప్రారంభించాక తన సహకారం తీసుకుంటానని బదులు చెప్పి అక్కడి నుంచి పంపించినట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో ఈనెల 7న నిమ్మ భరత్ మంత్రికి వాట్సాప్ ద్వారా మెసేజ్‌పెట్టి బ్లాక్‌మెయిల్ చేసినట్లు సీఐ తెలిపారు. మధ్యాహ్నం 12గంటల్లోగా రూ.10లక్షలు అకౌంట్‌లో వేయకపోతే వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తానని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, తీర్మార్ మల్లన్నకు వీడియో షేర్ చేస్తానన్నానని బెదిరించాడన్నారు. తనపై అసత్య ఆరోపణలు చేసి రాజకీయంగా దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్న నిమ్మ భరత్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ రామగుండం సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

రేషన్ బియ్యం కేసులో ముగ్గురికి జైలు

కరీంనగర్‌క్రైం: రేషన్‌బియ్యం విషయంలో అక్రమాలకు పాల్పడిన ముగ్గురిని జైలుకు తరలించినట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా అధిక ధరకు విక్రయించేందుకు దుర్శేడ్‌లోని శ్రీ వెంకటేశ్వర రైస్‌మిల్లుకి తరలిస్తున్న కరీంనగర్ పరిధిలోని గోపాల్‌పూర్‌కి చెందిన రేషన్ డీలర్ అంజయ్య, రైస్ మిల్లు యజమాని సంతోష్‌రెడ్డి, ట్రాలీఆటో డ్రైవర్ మధులపై కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమంగా 504 క్వింటాళ్ల రేషన్‌బియ్యం తరలించినట్లు ఒప్పుకున్నారు. బుధవారం కోర్టులో హాజరుపర్చగా 14రోజుల రిమాండ్ విధించారు.



పోలీసుల అదుపులో నిందితులు